# వాసంతి

"వీధి తలుపు అలా ఒక్క వరసని ఎవరో బాదేస్తూ ఉంటే వినిపించడంలేదూ ?...కవితాసమాధిలో ఉన్న తమని లేపి ఈ సంగతి చెప్పడానికి వంటింట్లో పని మానుకుని ప్రత్యేకం నేను రావాలా ?... వెళ్ళి ఎవరో ఏమిటో కాస్త కనుక్కోండి. నాకు అవతల పోపు మాడిపోతోంది" అంటూ తుఫాన్‌లా వచ్చి మేఘంలా గర్జించి తటిల్లతలా చట్టున కను విప్పు కలిగించి అంతలోనే మాయమైన మా శ్రీమతి ఆజ్ఞని శిరసావహించడంకోసం, కలంమూసి, ఒళ్ళు విరుచుకొని ఒక్కమాటు లేచాను. తలుపుమీద రమఢోళ్ళు మోగిస్తున్న ఆ ప్రబుద్ధుడెవడో తెలుసుకుని, మెత్తగా చివాట్లుపెట్టి గట్టిగా బుద్ధి చెబుదాం అని.

తీరా తలుపు తీసి చూస్తే ప్రభాకరం! పిల్లల ఆట వస్తువులు అమ్మేవాడిలాగ రెండుచేతుల్లోనూ రబ్బరు బెలూనులూ, గిలకలూ, లక్కసామానులూ పట్టుకుని నవ్వుతూ నుంచున్నాడు. వాణ్ణి చూసి నాలుగైదేళ్ళు దాటిందేమో, ఇవాళ వాడు హఠాత్తుగా తలుపు తీసేటప్పటికి ఇలా కనిపించడంతో ముఖం ఇంతయి "ఏరోయ్! ఇదేనా రావడం! ఆ చేతిలో అవన్నీ ఏవిటి ?" అన్నా. వాడేం సమాధానం చెప్పకుండా చిన్నగా నవ్వి లోపలికి వచ్చి, ఆ ఆటవస్తువు

లన్నీ జాగ్రత్తగా టేబిల్ మీద పెట్టి రిక్షావాడికి డబ్బులిచ్చి పంపేసి స్థిమితంగా 'మా వదినేది?' అన్నాడు.

"లోపలుంది వంటింట్లో. ఏమేవ్, ప్రభాకరం వచ్చాడు" అంటూ లోపలికి ఓ కేక వేశా. వెంటనే శ్రీమతి పీఠి గదిలోకి వచ్చి "ఏం ప్రభాకరం?...అంతా కులాసా?" అంటూ అడుగుతూనే టేబిల్ కేసి చూసి ఆశ్చర్యపోతూ 'ఇవేమిటండీ!' అంది.

"నాకేం తెలుసు? మీ మరిదిని అడుగు. వాడికేం అవసరం ఉండి తెచ్చుకున్నాడో" అన్నా నిర్లిప్తంగా.

"ఏమిటోయ్ ప్రభాకరం, ఇవన్నీ నువ్వు తెచ్చావా?" అంది.

అవు నన్నట్లు వాడు తల ఊపాడు.

"ఏమిటి విశేషం? మాకు తెలియకుండా అప్పుడే నీకు పెళ్ళి కావడం పిల్లలు కలగడం..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది.

"అవునే - వాడి పెళ్ళికి నిన్నూ నన్నూ పిలవాలని ఎక్కడుంది? ఇంకా ఏదో చిన్ననాటి పాతస్నేహాన్ని మన్నించి అప్పుడప్పుడు మనల్ని చూడ్డానికి వస్తున్నాడు అదే చాలు" అన్నా నిష్ఠూరంగా వాడికేసి చూస్తూ.

"అలా అంటే నేను ఒప్పుకోనండి. శుభలేఖ మనకీ వేసే ఉంటాడు"

"కాని పోస్టల్ వాళ్ళు మనకి అందించలేదంటావు, అంతేనా?" అన్నాను కంటి కొననుండి ప్రభాకరం ముఖ కవళికలు కనిపెడుతూ.

"ఇద్దరూ చెరోపక్కనుంచీ అలా బాంబుషెల్స్‌లా మాటలు వదిలెయ్యడమేనా, నన్నేమన్నా కొంచెం మాట్లాడ నిస్తారా?" అన్నాడు 'లైట' తీసి పాగాకొయ్యకి తగిలిస్తూ ప్రభాకరం.

"నువ్వు ఊరుకోవే! పాపం, వాడి సంసారం బాధ ఏదో చెప్పనీ!" అన్నా హేళనగా.

"ఈ ఆటవస్తువులన్నీ నా పిల్లలకోసం అనికదూ మీ అభిప్రాయం. మీకు తెలియకుండానూ, మీరు రాకుండానూ నా పెళ్ళి జరిగి ఉంటుందని అసలు మీరు ఎలా అనుకున్నారు?" అన్నాడు నాకేసీ మా శ్రీమతికేసీ చూసి నవ్వుతూ.

"మరి అయితే ఇవన్నీ ఎవరికి?" అంది మా శ్రీమతి.

"ఎవరికా?... మీకు పుట్టబోయే అమ్మాయికి" అన్నాడు సీరియస్‌గా. నేను పకపకా నవ్వాను. నాకేసి ప్రభాకరం అదోమాదిరిగా చూసి "మరీ అలా నవ్వుతూ తీసిపారెయ్యకు. ఈ ఏడెనిమిదేళ్ళనుంచీ పిల్లలు కలగకపోతే ఇక కలగరనేదేమిటి? వచ్చే రెండు మూడేళ్ళలో నీకు సంతానప్రాప్తి కలగడం, అందులోనూ తప్పకుండా ఆడపిల్ల పుట్టడం రూఢి" అన్నాడు. మా శ్రీమతి సిగ్గుతో కాబోలు మొహం అటు తిప్పుకొని గోడనున్న ఫోటో చూస్తోంది.

"ఏమిటంత ఖచ్చితంగా చెబుతున్నావ్? ఈ మధ్య నేమైనా జాతకాల పిచ్చి పట్టిందేమిటి?" అన్నా.

"చెప్తాగా - అంతా సావకాశంగా చెప్తా" అన్నాడు.

భోజనాలయ్యాక స్థిమితంగా అంతా తమలపాకులు వేసుకుంటూన్న సమయంలో తనంతట తానే ఇలా మొదలు పెట్టాడు.

"నీకు తెలుసుకదా మా కుటుంబాన్ని పట్టుకు పీడిస్తూన్న రెండు సమస్యలూను. ఏళ్ళు జరుగుతూన్నా అమ్మకి ఆరోగ్యం లభించదు – ఇంటర్వ్యూలకింద ఎన్నివందలు తగలేసినా మనకి ఉద్యోగం దొరకదు. చివరకి విసుగెత్తి అమ్మ మందులు పుచ్చుకోవడం మానేసింది. నేను ఉద్యోగాలికి దరఖాస్తులు పెట్టడం మానేశాను. నాలుగు నెలల క్రితం మమ్మల్ని చూడడానికని మావయ్య వచ్చాడు. వచ్చి అలా నిరాశగా ఏ ప్రయత్నమూ చెయ్యకుండా ఉండిపోయిన నన్నూ, అమ్మనీ చూసి తల వాచేలా చివాట్లు పెట్టి మళ్ళీ మందు తీసుకోమని అమ్మనీ, మళ్ళీ ఉద్యోగానికి ప్రయత్నం చెయ్యమని నన్నూ హెచ్చరించాడు. మేం అంత ఉత్సాహం చూపకపోవడంతో "మా ఊళ్ళో ప్రశ్నలుచెప్పే ఒక గొప్ప వ్యక్తి ఉన్నారు. ఆయనని పోనీ ప్రశ్న అడుగుదువుగాని నా" అన్నాడు నాకే ప్రశ్నలమీద నమ్మకం లేదేమో– మొదట 'ఊహూఁ!' అన్నా. తర్వాత మావయ్య మనస్సుకి నొప్పి కలగకుండా ఉండడంకోసం సరే అన్నా.

మావయ్య వాళ్ళ ఊళ్లో ఉన్న ఆ జ్యోతిష్కుడి దగ్గిరికి వెళ్తే మూడుప్రశ్నలని రహస్యంగా రాసి ఓ కవరులో పెట్టి కవరుమూసి సీలువేసి తనకి ఇమ్మన్నాడు. నేను నా ఉద్యోగం, అమ్మ ఆరోగ్యం గురించి రెండుప్రశ్నలూ రాసి, మూడో ప్రశ్నగా నీకు పిల్లలు పుడతారా, పుడితే ఆడా,

మగా అని తమాషాగా రాసి, ఆయన చెప్పిన ప్రకారం కవరుకి సీలువేసి ఆయనకి ఇచ్చాను. నేను ఏ ఏ ప్రశ్నలు వేశానో మావయ్యకి కూడా చెప్పలేదు సుమా! నాలుగు రోజులు పోయాక నా సీలుకవరు సీలుకవరుగానే నాకు పంపాడు ఆయన. దానితో ఆయన మూడు సమాధానాలు కూడా పంపాడు ఫలిస్తుంది - లాభంలేదు - కుంకుమ-అని- నాకు వాటి అర్థం తెలియలేదు. నా ప్రశ్నలు చెప్పాక మావయ్య వాటి అర్థాలు వివరించాడనుకో.

ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే ఈమాటు నేను వెళ్ళి వచ్చిన ఇంటర్వ్యూ ఫలించి నాకు ఉద్యోగం వచ్చింది. రేపు వెళ్ళి జాయిన్ అవుతున్నా. అమ్మకి ఇంక ఏమందు ఇచ్చినా లాభంలేదనీ, అలాగే ఏ రెండు మూడేళ్ళో తీసుకుంటుందనీ ఆఖరిసారిగా మొన్న డాక్టర్లు తేల్చేశారు. ఇలా ఆజ్యోతిష్కుడు చెప్పిన ఆ రెండు ప్రశ్నలూ జరిగినట్టే! రెండు జరిగాక మూడోది జరక్కుండా ఉంటుందా? అంటే మా ఇంట్లో అమ్మాయి తప్పకుండా వెలుస్తుందన్నమాట! అందుకే ఈ బెలూనులూ, లక్కపిడతలూను" అంటూ ముగించాడు ప్రభాకరం.

అంతా విన్నాక వాడిని చూసి నవ్వాలో, జాలి పడాలో నా కర్థంకాక మా శ్రీమతికేసి తిరిగి విన్నావా? ఇలా ఉంది పీడి విజ్ఞానమూ వివేకమూను. ఆ మూర్ఖుడేదో చెప్పాట్ట - దాంతో ఈ ప్రబుద్ధుడు కాబోలనుకొని వెంటనే గిలకలూ, లక్కపిడతలూ అవీ పట్టుకు వచ్చేశాడుట! చెప్పే వాడికి లేకపోతే వినేవాడికేనా ఉండొద్దూ" అన్నా.

నా మాటలకి చిన్నబుచ్చుకున్నట్లు మొహంపెట్టాడు ప్రభాకరం. వెంటనే అర్ధాంగి నాకేసి తిరిగి "మీరలా ప్రతీదీ తీసిపారేస్తే ఎలా? అతను చెప్పినట్లు ఆ జ్యోతిష్కుడు నిజంగా గొప్పవాడేమో!" అంది.

"అంటే అతను చెప్పినట్లు జరుగుతుందంటావ్ !"

"ఏమో - ఏం చెప్పగలం!" అంది.

తన వాదనకో ఓటు రావడంతో బలాన్ని పుంజుకొని ప్రభాకరం రెట్టించిన ఉత్సాహంతో "మొదటి రెండూ చెప్పినట్లు నిక్కచ్చిగా జరిగాయా లేదా? అలాగే ఇదీను" అన్నాడు.

"ఇంకనేం? నీకు అది తోడయింది. దానికివాళే పది మంది పిల్లలు ఇంట్లో మసులుతున్నంత ఆనందంగా ఉంది" అన్నా చిరాగ్గా.

మా శ్రీమతికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అదేవిటిరా? జ్యోతిషం చూపించింది నేనూ, మధ్యన చివాట్లు ఆవిడకీనా?" అన్నాడు ప్రభాకరం నొచ్చుకుంటూ.

కాస్సేపు ఎవళ్ళం మాట్లాడలేదు.

మా కలకంఠి ఇంకా కన్నీరు ఒలికిస్తూనే ఉంది.

"సరే, బాగానే ఉంది. ఎవరేనా వింటే నవ్విపోయారుగానీ ముందా సామానంతా తీసి డ్రాయరులో దాచు. ఇంకీ విషయం ఇంతటితో కట్టిపెట్టండి ఇద్దరూను" అన్నా గట్టిగా.

అంతటితో ఆ సంగతి అలా ఆగిపోయింది. ఆ తర్వాత రెండు రోజులుండి ప్రభాకరం వెళ్ళిపోయాడు.

ఇది జరిగిన నెల్లాళ్ళకి ఓ రోజున, అనుకోకుండా మధ్యాహ్నం పూట శలవు వచ్చి పెందరాళే ఇంటికి వచ్చాను. వీధితలుపు గడియ వేసి ఉంది. 'తలుపు తియ్యి'మని కేక వెయ్యబోయి, అంతలో లోపలినుంచి ఏదో స్వరం విని పించి, చట్టున ఆగి 'ఏవిటా అది?' అని విన్నాను

ఎవరో సోది అమ్మి - సోది చెప్తోంది.

తలుపు సందులోంచి చూద్దునుగదా మా శ్రీమతే ఆ మనిషికి ఎదురుగుండా కూచుని సోదె చెప్పించుకుంటోంది. ఆ మనిషి ఓ చేత్తో మా ఆవిడ చెయ్యి పట్టుకొని చూస్తూ, రెండో చేతిలో ఉన్న ఓ చిన్న కర్రని మా శ్రీమతి రెండో చేత్తో పట్టించి, ఆ కర్రని, పాడుతున్న పాటకి లయగా ఊపుతూ ఏదో చెప్తోంది ఆ స్థితిలో మా గృహలక్ష్మిని చూసేటప్పటికి నాకు ఒళ్ళు మండుకుపోయింది. ఎంత నాగరి కతనీ, సంస్కారాన్నీ నూరిపోస్తే ఏం లాభం? దాని పల్లె టూరి అలవాట్లూ, ఆ సోదె చెప్పించుకోవడాలూ, తాయె తులు కట్టించుకోవడాలూ మాత్రం పోలేదు.

"ఓ యమ్మో ఓయమ్మ! బొట్టు అంటేనే తెల్దే నా పిచ్చితల్లి? ఆడబిడ్డ కలుగుతుందే నా కన్నతల్లి! ఇంట మాలచ్చి ఎలుస్తుందే నా బంగారుతల్లి..." ఇలా సాగి పోతోంది ఆ సోదెదాని సోది. దాని మాటలకి మొహం అంత అయి, ఆనందంతో గుటకలు మింగుతూ వింటూ కూచున్న మా శ్రీమతిని చూసేసరికి నాకు కోపం తారస్థాయి నంటింది.

కోపంతో గబగబా తలుపు తట్టాను. కంగారుగా ఆ సోదె మనిషిని దొడ్డిదోవని పంపేసి, పీటా చేటా వగైరాలన్నీ ఎక్కడివక్కడ సర్దేసి నాకు తలుపు తీసేటప్పటికి బాగా ఆలశ్యం అయింది.

"ఇంతసేపు పట్టిందేం తలుపు తియ్యడానికి ?" అన్నా సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

మొదట్లో కొంచెం తొట్రుపడి తెల్లబోయి నాకేసి చూసి అంతట్లోనే సర్దుకొని "అబ్బె - మరేంలేదు. నిద్దర పోతున్నా. అందువల్ల..." అంటూ మధ్యలోనే మాట మింగేసింది.

అసలు విషయాన్ని కప్పిపుచ్చడంకోసం పడుతున్న ఆపాట్లూ, అబద్ధాన్ని నిజంగా చూపించడంకోసం చేస్తున్న ఆ ప్రయత్నం చూస్తే నాకు కోపంపోయి నవ్వువచ్చింది.

అయినా కోపాన్నికాని నవ్వునికాని పైకి రానీయకుండా గంభీరంగా మొహం పెట్టి 'అహా !... అలాగా !' అంటూ ముక్తసరిగా అనేశా.

ఆరోజునుంచీ ఆమెలో ఏదో నూతనోత్సాహం కనిపించ సాగింది. ముఖంలో ఓ వింతవెలుగూ, పనిలో ఓ కొత్త చురుకుదనం, నడవడిలో ఓ అపురూపమైన సంతృప్తితో కూడిన ఆనందం కనిపించసాగాయి. ఎప్పుడూ లేంది ప్రతి విషయంలోనూ పొదుపుతనం చూపిస్తోంది.

'ఎప్పుడూ లేంది అమ్మాయిగారికి పొదుపుతనం వచ్చిందే !' అని కనక నేనంటే,

"అవును. ఇద్దరం ఉన్నప్పుడే మనం కాస్త వెనకేసు కోకపోతే ఆనక మనం ఏం చెయ్యగలం ?" అనేది.

"ఆనక అంటే ?...పిల్లలు కలిగాకా ?" అందామని కొంటెగా అనిపించీకూడా, ఏమీ అనకుండా ఆమె అమాయ కత్వానికి మాత్రం లోపల్లోపల నవ్వుకొని ఊరుకొనేవాణ్ణి.

రోజులు గడుస్తున్నాయి. రోజురోజుకీ మా శ్రీమతిలో మాత్రం స్పష్టంగా మార్పేదో కనిపిస్తూనే ఉండేది. చేసే ప్రతీ పనిలోనూ, అనే ప్రతీ మాటలోనూ భవిష్యత్‌లో మాకో అమ్మాయి పుట్టబోతోంది అనే భావం ద్యోతకం చేసేది. ఆమె అంత ఖచ్చితంగా భవిష్యత్తుని నమ్ముతూంటే నేనీ జోస్యాలనీ, సోదికబుర్లనీ అవహేళన చేస్తూ వాటి ఫలితాలమీద పూర్తి అవిశ్వాసాన్ని ప్రకటించడం అంత తెలివైనపని కాదేమో అనిపించేది అప్పుడప్పుడు. ఏమంటే- ఏమో! ఎప్పుడూ మన అభిప్రాయమే రైటవాలని ఏముంది? కొంపదీసి వాళ్ళ జోస్యమే రైటవుతే ఇంకేమైనా ఉందా ? నేనూ, నా అవహేళనా ఘోరంగా ఓడిపోవడమే కాకుండా మా ఆవిడ దృష్టిలోనూ, ప్రభాకరం దృష్టిలోనూ నవ్వుల పాలైపోనూ? అందుకే తెలివిగా ఎటూ చెప్పకుండా ఏమీ తేలకుండా మౌనంగా ఉండడం, మధ్యేమార్గం అవలం బించడం మంచిది.

కొన్ని బలహీనమైన క్షణాల్లో ఇలా ఆలోచించినా వెంటనే 'నాన్సెన్సు - నేనుకూడా వీటి అన్నింటినీ నమ్మి వీటి ప్రభావంలో పడుతున్నానేవిటి ? వివేకం ఉన్నవాడు

కూడా మూఢనమ్మకాల్లో పడితే ఎలా ?' అనుకుంటూ బల వంతంగా ఇంత వ్యక్తిత్వాన్ని ఇంత ఆత్మవిశ్వాసాన్ని పుంజు కుంటూ ఉండేవాడిని.

ఇలా విశ్వాసానికీ, అవిశ్వాసానికీ మధ్య రావి ఆకులా రెపరెపలాడుతున్న నా ఇంగితాన్ని పూర్తిగా విశ్వాసంవేపే మళ్ళించి "నిజమే సుమా! జోస్యంకూడా ఒకరకమైన సైన్సే! సైన్సులోలాగే దీని ఫలితాల్నికూడా కచ్చితంగా తెలుసుకోవచ్చు" అనే అభిప్రాయాన్ని నాలో 'స్థిరోభవా వరదోభవా' చేసినవారు మా మేనేజరుగారు.

ఓరోజు నేదో మాటల సందర్భంలో "ఆఁ! ఈ జ్యోతిషాలూ, ఫలితం చెప్పడాలూ ఇవన్నీ వట్టి బోష్" అన్నా. ఆయన చేతులు చూసి ఫలితాలు చెప్పడంలో అందెవేసిన చెయ్యిట! నాకేం తెలుసు? నేను మామూలుగా అనే శాను. ఇంక చూసుకో! సాముద్రికం అనేది సర్వలక్షణ యుతమైన సాధికార శాస్త్రం అనీ, జాగ్రత్తగా చెయ్యి చూసి ఫలితం చెబితే అది ఇంక జరిగి తీరవలసిందే కాని దానికి తిరుగు లేదనీ, అలా తను ఎంతమందికో చెప్పాననీ, చెప్పినవాటిల్లో ఒక్కటికూడా బీరుపోకుండా అన్నీ అక్ష రాలా జరిగాయనీ ఓ గంట లెక్చర్ దంచి నాచేత బలవం తంగా 'సాముద్రికం గొప్పశాస్త్రం' అని ఒప్పించి మరీ ఆగాడు. ఆగాడంటే పూర్తిగా ఆగాడనా ?...ఏదీ మీా చెయ్యి చూస్తాను అంటూ, వద్దు మొర్రో అని ఎంత మొత్తు కుంటున్నా వినిపించుకోకుండా నా చేతిని లాక్కుని, కాసేపు తీక్ష్ణంగా రేఖలన్నీ పరిశీలించి. 'లైఫ్ లైన్ హార్ట్ లైన్'

అంటూ తనలో తనేవో గొణుక్కుని, మధ్యమధ్య తల పంకిస్తూ, ముఖం చిట్లిస్తూ మొత్తంమీద ఏమైతేనేం, ఫలితాలు చెప్పాడు. ఆ చెప్పిన ఫలితాలన్నింటిలోనూ ప్రస్తుత కథాంశానికి అవసరం అయింది. నాకు రెండు మూడేళ్ళలో ఒక ఆడపిల్ల పుడుతుందని.

ఆయన ఆ ఫలితాన్ని చెబుతున్నప్పుడు నేను ఆశ్చర్యంతో విస్తుపోయాను. ఏవిటీ చిత్రం? అక్కడ ప్రభాకరానికీ ఆ ప్రశ్నల జ్యోతిష్కుడు ఇలాగే చెప్పాడా! సరే. పుట్టబోయేది ఆడపిల్ల అనే సంగతి సోదెమనిషి చెబుతూ ఉండడం తన చెవులతో తను విన్నదేకదా ?...ఇంక పోతే ఈయనా అదే మాట అంటున్నాడు. రెండూ కాకతాళీయంగా జరిగాయంటే ఈ మూడో జ్యోతిషం మాటేవిటి ? అబద్ధం అయితే మూడూ ఒకలాగే ఎలా చెప్తాయి. అందువల్ల అబద్ధం కాదన్నమాట ! మా ఇంట్లో ఓ అమ్మాయి వెలుస్తుందనడం ఖాయం. మొదట్లో ఏమో అనుకున్నాను కాని ఈ జ్యోతిషాలూ, సాముద్రికాలూ నిజమేనన్నమాట!

ఆ సాయంత్రం మా శ్రీమతితో ఆ విషయమే ప్రస్తావించాను. "మొదట్లో మీరు నమ్మలేదు కానీ నేను చెప్పలేదుటండీ !" అంది ఆమె

"ఏవిటి నువ్వు చెప్పిందీ, నేను చెప్పందీను" అన్నా.

"అదే - జ్యోతిషాలూ అవీ నమ్మాలిసుమాండి అని - ప్రభాకరం చెప్పినదాన్ని నేను సమర్థించబోయేసరికి ఆ రోజున ఖస్సుమంటూ తాడి ఎత్తున లేచారు."

"అవును – అప్పట్లో నీ పిచ్చినమ్మకం చూస్తే ఒళ్లు మండదేవిటి ?"

"ఇప్పుడు ఆ పిచ్చినమ్మకం ఎవరిదో !"

"ఆఁ!... దెప్పడానికి బాగా వీలుచిక్కిందిప్పుడు నీకు. అవునుగానీ – ప్రభాకిరం ఆరోజున ఆ జ్యోతిషం విషయం చెబితే కాబోలనుకొని నమ్మేశావేం నువ్వు ?"

"ఆ, మరే! నేనంత వెర్రిదాన్నేవిటి ?... మీతో చెప్పలేదు కాని ఆ తర్వాత నేను సోదెదాని ద్వారా ఆ సంగతి రూఢిపరుచుకున్నాను" అంటూ తను సోదె చెప్పించుకోవడం వగైరా ఒక్కొక్కటే చెప్పసాగింది. "అహా ! అహా !" అంటూ ఏం తెలియనట్లు నటిస్తూ ఆమె చెప్పినవన్నీ వినసాగాను.

ఒకమాటు నేను మాంఛి సరదాగా సంతోషంగా ఉన్న సమయం కనిపెట్టి 'ఏవండీ!' అని గునుస్తూ మా శ్రీమతి నా దగ్గరికి వచ్చింది. నేను బుజ్జగిస్తూ "ఏవిటి కథ ? చెప్పు. ఏం కావాలి?... అనుమానిస్తావేం ? ఏవిటో చెప్పు" అన్నా.

నాచేత అలా అరగంట బతిమాలించుకొని "మరేమోనే – మరేమో – మన అమ్మాయికి మా అమ్మపేరు పెడదాం అండి" అంది.

నాకు గుండె ఆగినంత పని అయింది

మా అత్తగారి పేరు పూర్వోత్తరంవాళ్ళ అందరి పేర్లలాగా శుద్ధ మోటపేరూ, పరమ పల్లెటూరి పేరూను. లేక లేక పుడుతూన్న మా చక్కనిచుక్కకి ఆ పేరా ?–ఛా– ఈ విషయం ఆలోచిస్తేనే నాకు ఒళ్లంతా తేళ్ళూ జెఱ్ఱులూ

పాకుతున్నట్లు అనిపించసాగింది. ఆ పేరు పెట్టాలని అసలు దానికి ఆలోచన ఎలా వచ్చిందా అనిపించింది నాకు. 'ఇలాంటి చచ్చు ఆలోచనలు ఎప్పుడూ రానియ్యకు' అందామనుకొని మళ్ళీ ఎందుకొచ్చిందిలే అని తగ్గి ఊరుకొన్నాను.

నెమ్మదిగా కూర్చోబెట్టి, పెద్దవాళ్ళమీద అభిమానం ఉంటే అది మరోరకంగానూ మరోరకంగానూ చూపించాలి కాని ఇది మార్గం కాదనీ, పైగా వాళ్ళమ్మ పేరు పెట్టి మా అమ్మపేరు పెట్టకపోతే మా నాన్నకీ, అన్నయ్యలకీ కోపం వస్తుందనీ, రెండూ కలిపి తోక చేంతాడు చెయ్యకుండా చక్కగా అందమైన కొత్తపేరు ఏదో పెడదాం అని నచ్చచెప్పి ఒప్పించాను.

సరే - ఏ పేరు పెడితే బాగుంటుంది అనే సంగతిని మేం చర్చించుకోని రోజంటూ లేదు. పొద్దుటే లేచి మొహాలు కడుక్కొనేటప్పుడు ప్రారంభం అయే ఆ చర్చ నేను ఆఫీసుకి బయలుదేరేదాకా సాగి, తిరిగి సాయంత్రం సశేషంగా ఆరంభం అయేది.

నేను పెట్టిన పేర్లు తనకి నచ్చేవి కావు. తను నిర్ణయించిన పేరు నాకు బాగుండేది కాదు. మామూలుగానే ఉన్నాయి కాని కొత్తదనం లేదని కొన్ని పేర్లనీ, మరీ విచిత్రంగా ఉన్నాయని కొన్ని పేర్లనీ కాదన్నాము. తను చెప్పిన పేర్లు మరీ పాతకాలపువాటిగా ఉన్నాయి. పైగా వాటిలో అందమైన అర్థస్ఫురణ ఏమీ లేదని నేనంటే, నేను సూచించిన పేర్లు కొన్ని నా స్నేహితురాండ్ర పేర్లు కనక ఏవైనాసరే అవి పెట్టడానికి వీలులేదు అనేది - ఇంక కొన్ని

పేర్ల అర్థం ఎవరికీ తెలియదు. డిక్షనరీ చూసి అర్థం తెలుసు కోవలసినంత క్లిష్టమైన పేరు పిల్లకి పెట్టడానికి వీలులేదు అనేది.

ఇలా పుట్టబోయే పిల్లకి పెట్టబోయే పేరు గురించి కొన్ని నెలలపాటు వాదించి, చర్చించి, తల బద్దలు కొట్టు కొని ఆఖరుకి ఇద్దరం ఓ అంగీకారానికి వచ్చి ఓ పేరు నిర్ణయించాం 'మా దాంపత్య జీవితంలోకి వసంతంలా వచ్చి మమ్మల్ని అలరించే ఆ పాపకి 'వాసంతి' అని పేరు పెడితే బాగుంటుంది' అనేదే ఆ నిర్ణయం.

అలా నిర్ణయించుకొన్న మర్నాడు చక్కగా గుండ్రని అక్షరాలతో "మా పుట్టబోయే అమ్మాయికి వాసంతి అని పేరు నిశ్చయం చేశాం" అని ప్రభాకరానికి ఉత్తరంకూడా రాసేశాం.

ఆ తర్వాత నాలుగేళ్ళకి మా ఇల్లు బోసినవ్వులతో కలకలలాడింది. "పేరుమీద ఉన్న మమకారంకొద్దీ మా ఇంట్లో వాసంత సౌందర్యాలు సృష్టిస్తూన్న ఆ పసికందు మగపిల్లవాడయినప్పటికీ వాసంతీ! అనే పిలుస్తున్నాం" అని ప్రభాకరానికి రాసిన జాబుకి అప్పటికీ ఇప్పటికీ జవాబు రాలేదు.

అన్నట్లు చెప్పడం మరిచాను.

మా మేనేజరుగారు నాతో మాట్లాడ్డం మానేశారు, మా అబ్బాయి పుట్టిన మర్నాటినుంచీ.